
# సాక్షి చిత్తూరు

శనివారం । 1 । జూన్ । 2024




### నేటినుంచి జూనియర్ కళాశాలలు

వేసవి సెలవుల అనంతరం జూనియర్ కళాశాలలు శనివారం నుంచి పునఃప్రారంభం కానున్నాయి.

- IIలో



### సమ్మేటివ్ ఫలితాలను అప్‌లోడ్ చేయాలి

సమ్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షల ఫలితాలను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని డీఈఓ దేవరాజు ఆదేశించారు.

- IIలో



### ఉల్లంఘనులపై ఉక్కుపాదం

ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనదారులపై కఠిన చర్యలు తప్పవని ఎస్పీ మణికంఠ హెచ్చరించారు.

- IIలో

## న్యూస్‌రీల్

### నేడు అర్ధగిరిలో హనుమజ్జయంతి వేడుకలు

**తవణంపల్లె:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీవీరాంజనేయస్వామి ఆలయంలో శనివారం హనుమజ్జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ఈఓ హనుమంతురావు తెలిపారు. ఇందులో భాగంగా శుక్రవారం సాయంత్రం 6గంటలకు అంకురార్పణ, రక్షాబంధనం, కలశస్థాపన, నివేదన, మంగళ హారతి కార్యక్రమాలు జరిగాయన్నారు. శనివారం తెల్లవారుజామున 5 గంటలకు సుప్రభాత సేవ, పంచామృత అభిషేకం, విశేష అలంకరణ ఉంటుంది. 9 గంటలకు ఇరుముడుల చెల్లింపులు, 11 గంటలకు ఆంజనేయ సహస్రనామ హోమం, స్నపన తిరుమంజనం, మంత్రపుష్పం, మహా మంగళహారతి, తీర్థప్రసాదాల వినియోగం ఉంటుంది. సాయంత్రం 5 గంటలకు సహస్రనామ పూజ, రాత్రి 7 గంటలకు ప్రాకారోత్సవం ఘనంగా నిర్వహించనున్నారు. ఉదయం 7 గంటల నుంచి భక్తబృందంచే రామకోటి భజన ఉంటుందని ఈఓ వివరించారు. భక్తులు అశేషంగా పాల్గొని వేడుకలను తిలకించి పునీతులు కావాలని కోరారు.

### నేటి నుంచి రేషన్ పంపిణీ

**కాణిపాకం:** జిల్లా వ్యాప్తంగా శనివారం నుంచి రేషన్ పంపిణీ చేయనున్నట్లు డీఎస్‌ఓ శంకరన్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ 1079 షాపుల కింద 5 లక్షల కార్డులకు డోర్‌డెలివరీ పద్ధతిలో సరుకులు ఇస్తారన్నారు. జూన్ నెల కోటా కింద బియ్యం 9 వేల టన్నులు, చక్కెర 260 టన్నులు ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు.

### శ్రీవారి దర్శనానికి 18 గంటలు

**తిరుమల:** తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూ బాట గంగమ్మ ఆలయం వద్దకు చేరింది. గురువారం అర్ధరాత్రి వరకు 64,115 మంది స్వామిని దర్శించుకున్నారు. 32,711 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. కానుకల రూపంలో హుండీలో రూ.4.23 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది.

## బ్యాంకుల ద్వారానే పింఛన్లు

- అకౌంట్‌లు లేని, 80 ఏళ్లు దాటిన వారికి నేరుగా అందజేత
- జిల్లాలో 2,72,223 మందికి రూ.79.66 కోట్లు
- జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్ వెల్లడి



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్

**చిత్తూరు కలెక్టరేట్ :** జిల్లా వ్యాప్తంగా మే నెల సామాజిక పింఛన్లను డీబీటీ విధానంలో వారి బ్యాంకు ఖాతాలకు జమ చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జూన్ ఒకటో తేదీనే పింఛన్లను అందజేసేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో వృద్ధులు, దివ్యాంగులు సచివాలయాల వద్దకు రావాల్సిన అవసరం లేదన్నారు. ఆధార్ లింక్ బ్యాంక్ అకౌంట్‌లు ఉన్న లబ్ధిదారులకు డీబీటీ విధానంలో పింఛన్ నగదు జమ అవుతుందని తెలిపారు. జిల్లాలో 2,72,223 మంది లబ్ధిదారులకు రూ.79.66 కోట్ల నగదును పింఛన్లకు జమ చేయనున్నట్లు తెలిపారు. 2,72,223 మందిలో 1,88,059 మందికి బ్యాంక్ అకౌంట్‌లు లింక్ అయి ఉన్నాయని, వారి ఖాతాలకు నగదు జమ అవుతుందని పేర్కొన్నారు. మిగిలిన 84,164 మందికి నేరుగా సచివాలయ సిబ్బంది ఇంటి వద్దకు వెళ్లి అందజేస్తారన్నారు. పింఛన్ల పంపిణీ ప్రక్రియ కమిషనర్‌లు, ఎంపీడీఓల పర్యవేక్షణలో జరుగుతుందని తెలిపారు. బ్యాంకుల్లో పింఛన్ నగదు పంపిణీకి ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టామని జిల్లా ఎన్నికల అధికారి వెల్లడించారు.

## కుప్పంలో జంట ఏనుగుల స్వైర విహారం



బేటరాయస్వామి కొండ పంట పొలాల్లో జంట ఏనుగులు

- పంట పొలాలపై విధ్వంసం
- దారి మరల్చేందుకు అటవీ అధికారుల చర్యలు



మారప్పల్లె వద్ద సంచరిస్తున్న గజరాజులు

**కుప్పంరూరల్:** కుప్పం మండల పరిధిలో శుక్రవారం జంట ఏనుగులు చేసిన స్వైర విహారం చేశాయి. దీంతో జనం బెంబేలెత్తారు. వేకువ జామున జంట ఏనుగులు రామకుప్పం ననియాల ప్రాంతం నుంచి నూలుకుంట దేవరకొండ మీదుగా కుప్పం చేరుకున్నాయి. బంగారునత్తం, మారప్పల్లి మీదుగా బేటరాయస్వామి కొండ ప్రాంతంలోకి చొరబడ్డాయి. ఈ మార్గంలో జంట ఏనుగులు టమాట, స్వీట్ కార్న్, బీరకాయ పంటలను తొక్కి నాశనం చేశాయి. అక్కడక్కడ అరటి చెట్లు, టెంకాయ చెట్లను నేల కూల్చాయి. విషయం తెలుసుకున్న అటవీ అధికారులు వాటిని దారి మరల్చేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. బాణసంచా, టపాకాయలు పేలుస్తూ గ్రామాల వైపుకు రాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఉదయం నుంచి ఏనుగుల వెంటే పయనిస్తూ, బేటరాయస్వామి కొండ అటవీ ప్రాంతం నుంచి ఏనుగులను తమిళనాడు అటవీ ప్రాంతాలకు మరల్చేందుకు చర్యలు తీసుకున్నారు. దీంతో ప్రమాదం తప్పిందని రైతులు, అటవీ అధికారులు ఊపిరిపీల్చుకున్నారు.

## అల్లర్లను ఉపేక్షించం

**చిత్తూరు అర్బన్:** సార్వత్రిక ఎన్నికల ఎగ్జిట్‌పోల్స్ శనివారం వెలువడనున్న నేపథ్యంలో ఎవ్వరూ రెచ్చగొట్టే చర్యలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని చిత్తూరు ఎస్పీ మణికంఠ చందోలు హెచ్చరించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు ఊహాజనితం మాత్రమేనన్నారు. వీటిని నమ్మి ఓ పార్టీ గెలిచినట్లు, మరో పార్టీ ఓడిపోతున్నట్లు ఎవరైనా ప్రచారాలు చేసినా, అల్లర్లకు పాల్పడినా ఉపేక్షించే ప్రశక్తేలేదని స్పష్టం చేశారు. ఈవీఎంలలోని ఓట్లను లెక్కించడమే కచ్చితమైన ఫలితాలను ఇస్తుందనే విషయాన్ని అందరూ గుర్తించుకోవాలన్నారు. ఓట్ల లెక్కింపు పూర్తయ్యేంత వరకు ప్రజలు కూడా ఎలాంటి అవాస్తవాలను నమ్మకూడదని తెలిపారు. కౌంటింగ్ పూర్తయ్యేంత వరకు జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ ఉంటుందన్నారు. గుంపులు గుంపులుగా ఉండడం నిషేధమని, ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు.

క్లుప్తంగా

## సమ్మేటివ్ ఫలితాలను అప్‌లోడ్ చేయాలి

**చిత్తూరు కలెక్టరేట్ :** జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు గత విద్యాసంవత్సరం సమ్మేటివ్, అసెస్‌మెంట్ పరీక్షల ఫలితాలను తప్పనిసరిగా వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని డీఈఓ దేవరాజు ఆదేశించారు. శుక్రవారం డీఈఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎంఈఓలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అప్‌లోడ్ ప్రక్రియను ఎంఈఓలు పకడ్బందీగా పర్యవేక్షించాలని తెలిపారు. నమోదు చేయకపోతే హెచ్‌ఎంలపై శాఖాపరంగా చర్యలుంటాయని హెచ్చరించారు. యూడైస్ వివరాలు కూడా పకడ్బందీగా నమోదు చేయాలని తెలిపారు. పునః ప్రారంభానికి ముందస్తుగా పాఠశాలలను పరిశుభ్రం చేయించాలన్నారు. ఈ విద్యాసంవత్సరంలో అడ్మిషన్‌ల పెంపునకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. డీవైఈఓ చంద్రశేఖర్, ఎంఈఓలు సెల్వరాజ్, మోహన్, పలు మండలాల ఎంఈఓలు పాల్గొన్నారు.

## పంటలపై ఆగని గజ దాడులు



ధ్వంసమైన మామిడి తోట

**పెద్దపంజాణి:** మండలంలో పంట పొలాలపై ఏనుగుల దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. పెద్దకాప్పల్లి పంచాయతీ పరిధిలోని అటవీ సరిహద్దు గ్రామాలైన ఆకులవారిపల్లె, గౌరీనగర్, ముదిరెడ్డిపల్లె, జిట్టంవారిపల్లె, పెనుగొలకల, పెద్దకాప్పల్లె, తిప్పిరెడ్డిపల్లి, కొత్తబూరగపల్లి రైతులకు చెందిన పంటలను నాశనం చేస్తున్నాయి. గురువారం రాత్రి పుంగనూరు రేంజ్ పేటూరు బీటు నుంచి వచ్చిన ఏనుగులు పెనుగొలకల గ్రామ సమీపంలోని మామిడి తోటలపై విధ్వంసం సృష్టించాయి. అమరా రెడ్డి, చంద్రా రెడ్డి తదితరుల మామిడి చెట్లను ధ్వంసం చేశాయి. ముఖ్యంగా బేనీషా కాయలను సగం తిని, మిగిలిన సగాన్ని తొక్కి నాశనం చేశాయి. శుక్రవారం ఉదయం పొలాల వద్దకు వెళ్లిన రైతులు పంటనష్టాన్ని చూసి తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ఈ దాడుల్లో రూ.20 వేల మేరకు పంట నష్టం జరిగినట్లు అంచనా. రాయలపేట ఫారెస్టు బీట్ ఆఫీసర్ రవికుమార్ పంట నష్టాన్ని పరిశీలించారు. వివరాలను ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు. ట్రాకర్ల సాయంతో ఏనుగులను అడవిలోకి మళ్లించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

# ఉల్లంఘనులపై ఉక్కుపాదం

నేడు యువత బైక్‌లో అతివేగంతో దూసుకుపోతోంది. కొంతమంది కర్ణభేరి చిల్లులు పడేలా శబ్దం వచ్చేలా సైలెన్సర్లు పెట్టుకుంటున్నారు. మరికొందరు బైకుపై వెళుతూ ప్రమాదకరమైన స్టంట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో పక్కన వెళ్లే వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తున్నారు. ఇలాంటి వాళ్లను అదుపు చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా ట్రాఫిక్ నిబంధనలను కఠినతరం చేస్తూ కొత్త చట్టాన్ని తీసుకువచ్చింది. ఈ నిబంధనలు జూన్ 1వ తేదీ నుంచి అమలులోకి రానున్నాయి. నిబంధనలు పాటించని వారిపై కొరడా ఝుళిపిస్తూ నూతన చట్టాన్ని కచ్చితంగా అమలు చేయాలని చిత్తూరు ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశించారు. రోడ్లపై నిర్లక్ష్యంగా వాహనాలు నడిపేవారి భరతం పట్టడానికి పోలీసులు సిద్ధమయ్యారు. – చిత్తూరు అర్బన్

- నేటి నుంచి అమలులోకి నూతన ట్రాఫిక్ నిబంధనలు
- మద్యం మత్తులో వాహనం నడిపితే మూడేళ్ల జైలు
- అంబులెన్సుకు దారి ఇవ్వకుంటే రూ.10 వేల ఫైన్
- జిల్లా వ్యాప్తంగా తప్పనిసరిగా అమలు : ఎస్పీ మణికంఠ



కొత్తగా అమలు చేయనున్న రహదారి భద్రత, ట్రాఫిక్ నిబంధనల్లోని పలు సెక్షన్లు కఠినతరంగా ఉన్నాయి. దీన్ని అమలు చేయడం వెనుక నిత్యం జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలను కాపాడమే లక్ష్యంగా కనిపిస్తోంది. అతివేగంతో వాహనాలు నడపడం ఓవైపు ఉంటే.. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వడం, మద్యం సేవించి వాహనం నడిపితే రూ.2 వేల జరిమానాతో సరిపెడతారనే ధైర్యం, ఆపదలో ఉన్న వారిని రక్షించడానికి వెళ్లే అంబులెన్సు దారి ఇవ్వకుండా చోద్యం చూడడం లాంటి ఘటనలు నిత్యం మనకు కనిపిస్తుంటాయి. ఇలాంటి ఘటనలపై ఉక్కుపాదం మోపుతూ రాష్ట్ర ప్రభుత్వం జీవో – 21, మోటారు వాహన చట్టంలోని సెక్షన్ 200ను సవరిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో రహదారి భద్రతా నియమాలు ఉల్లంఘించే వారికి భారీ జరిమానాతో పాటు కొన్ని సెక్షన్ల కింద కేసు నమోదు చేయొచ్చు. వీటికి గరిష్టంగా పదేళ్ల వరకు జైలుశిక్ష కూడా పడే అవకాశం ఉంది. ఇది వాహన చోదకుల ఆలోచనలో తప్పకుండా మార్పును తీసుకొస్తుందని పోలీసు యంత్రాంగం భావిస్తోంది.

### ప్రాణంకంటే విలువైంది లేదు



కొత్త నిబంధనలు ఈ రోజు నుంచే అమల్లోకి వస్తాయి. ఇందులో ఎవరికీ మినహాయింపు ఉండదు. వీటిని ప్రతి ఒక్కరూ పాటించాల్సిందే. ఇక్కడ ప్రజల నుంచి భారీగా జరిమానాలు వసూలు చేయడం లక్ష్యం కాదు. డబ్బు కంటే ప్రాణం విలువైంది. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ కచ్చితంగా పాటిస్తే రోడ్డు ప్రమాదాలు జరగవు. ముఖ్యంగా మైనర్లకు వాహనాలు ఇచ్చి రోడ్లపైకి పంపొద్దు. లైసెన్సు ఉంటేనే వాహనం నడపాలి. ప్రాణాలు పోయాక జీవితాంతం బాధ పడడంకంటే.. నిబంధనలు పాటించేలా ఇంట్లో తల్లిదండ్రులు, విద్యాసంస్థల్లో గురువులు పిల్లల్లో చైతన్యం తీసుకురావాలి.

– మణికంఠ చందోలు, ఎస్పీ, చిత్తూరు

### కొత్త నిబంధనల్లోని కొన్ని అంశాలు..

- డ్రైవింగ్ లైసెన్సులేని వాళ్లకు వాహనం ఇస్తే దాని యజమానికి ఇప్పటి వరకు రూ.వెయ్యి విధిస్తున్న జరిమానాను రూ.5 వేలకు పెంచారు. లైసెన్సు లేకుండా వాహనం నడిపిన వ్యక్తికి రూ.500 వున్న జరిమానాను రూ.5 వేలు చేశారు. మైనర్లకు వాహనం ఇచ్చినా రూ.5 వేల జరిమానా విధిస్తారు.
- ర్యాష్ డ్రైవింగ్ చేసినా, మొబైల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేసినా రూ.2 వేలు విధిస్తున్న జరిమానాను రూ.10 వేలకు పెంచారు.
- మద్యం సేవించి వాహనం నడిపితే మొదటిసారి రూ.10 వేల జరిమానా, ఆరు నెలల జైలు శిక్ష, రెండోసారి ఇదే తప్పిదం చేస్తే రూ.15 వేల జరిమానా, మూడేళ్ల వరకు జైలుశిక్ష విధిస్తారు.
- వాహనాలతో రేసింగ్‌కు పాల్పడితే మొదటిసారి రూ.5 వేలు, రెండోసారి రూ.10 వేల జరిమానా విధిస్తారు. వాహనం నుంచి మితిమీరిన పొగ వచ్చినా, శబ్దం వచ్చినా మొదటి సారి రూ.1500, రెండోసారి రూ.3 వేల జరిమానా వసూలు చేస్తారు.
- పర్మిట్ లేకుండా వాహనం నడిపితే రూ.10 వేలు, ఓవర్‌లోడ్‌తో వెళితే రూ.20 వేల జరిమానా, ప్రతి అదనపు టన్నుకు రూ.2 వేలు, ఇన్సూరెన్సు లేకుంటే మొదటిసారికి రూ.2 వేలు, రెండోసారి రూ.4 వేల జరిమానా విధిస్తారు.
- అంబులెన్సు, అగ్నిమాపక వాహనాలకు దారి ఇవ్వకుంటే రూ.10 వేలు, హెల్మెట్ లేకుంటే రూ.వెయ్యి జరిమానా విధిస్తారు.
- మైనర్ వాహనం నడిపి ప్రమాదానికి కారణమైనట్లు కోర్టులో నిరూపణ అయినప్పుడు అతని సంరక్షకుడు, వాహన యజమాని దోషిగా పరిగణించబడతారు. దీనికి రూ.25 వేల జరిమానాతో పాటు మూడేళ్ల వరకు జైలుశిక్ష విధిస్తారు. వాహన రిజిస్ట్రేషన్‌ను కూడా రద్దు చేస్తారు.

## కౌంటింగ్ రోజున తిరుపతి రోడ్డుపై ట్రాఫిక్ మళ్లింపు

**చిత్తూరు అర్బన్:** జూన్ 4వ తేదీన చిత్తూరు సమీపంలోని ఎస్వీ–సెట్ కళాశాల ప్రాంగణంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ నేపథ్యంలో రాకపోకలపై నిషేధం విధిస్తున్నట్లు చిత్తూరు ఎస్పీ మణికంఠ ఓ ప్రకటనలో తెలిపారు. చిత్తూరు నుంచి తిరుపతి, కడప, పీలేరు, హైదరాబాద్ వెళ్లే వాహనాలు రెడ్డిగుంట కూడలి నుంచి కాఫీడే కూడలి మీదుగా ఆరు లైన్ల జాతీయ రహదారి మీదుగా ప్రయాణించాలన్నారు. తిరుత్తణి రోడ్డు వైపు నుంచి తిరుపతి వెళ్లే వాళ్లు జీడీ నెల్లూరు మీదుగా పుత్తూరు రోడ్డులో తిరుపతికి వెళ్లాలన్నారు. కడప, పీలేరు, తిరుపతి నుంచి చిత్తూరు వచ్చే వాహనాలు, వావిల్‌తోట, బండ పల్లె, పూతలపట్టు నుంచి చిత్తూరు వచ్చే వాహనదారులు సైతం రంగంపేట మీదుగా ఆరు లైన్ల జాతీయ రహదారిపై వరిగపల్లె మీదుగా కాఫీడే కూడలి నుంచి చిత్తూరు నగరంలోకి చేరుకోవాలని తెలిపారు. తిరుపతి నుంచి చిత్తూరుకు పెనుమూరు మార్గంలో రాకపోకలు నిషేధించినట్లు పేర్కొన్నారు. రంగంపేట ఫ్లై ఓవర్ నుంచి మురకంబట్టు ఫ్లై ఓవర్ వరకు వాహనాల రాకపోకలు పూర్తిగా నిషేధమన్నారు. కౌంటింగ్ సిబ్బంది, అభ్యర్థులు, ఏజెంట్లను మాత్రమే ఎస్వీ–సెట్ వరకు అనుమతిస్తామన్నారు. జూన్ 4వ తేదీ ఉదయం 4 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ నిబంధనలు అమల్లో ఉంటాయని ఎస్పీ తెలిపారు.

## ప్రేమ పేరుతో మోసం కేసులో యువకుడి అరెస్ట్

**చౌడేపల్లి:** బాలికలను ప్రేమ పేరుతో మోసం చేసిన కేసులో నిందితుడు ఆనంద్‌ను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. దుర్గసముద్రం పంచాయతీ బుటకపల్లెకు చెందిన వెంకటప్ప కుమారుడు ఆనంద్ ప్రేమ పేరుతో మాయమాటలు చెప్పి తనను మోసం చేసిన ఆనంద్‌పై యువతి పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దాదేపల్లె బస్ స్టాప్ వద్ద వేచి ఉన్న ఆనంద్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అరెస్ట్ చూపి పుంగనూరు కోర్టుకు తరలించగా న్యాయమూర్తి రిమాండుకు ఆదేశించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

## రెండేళ్ల డీ ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు

**తిరుపతి ఎడ్యుకేషన్ :** రెండేళ్ల కాలవ్యవధి కలిగిన డీ ఫార్మసీ కోర్సులో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని తిరుపతి కేటీ రోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి తెలిపారు. ఈ కోర్సుకు ఇంటర్ బైపీసీ, ఎంపీసీ రెగ్యులర్, ఓపెన్ స్కూల్ ద్వారా ఇంటర్ పూర్తి చేసినవారు, అలాగే ఇంటర్ తత్సమాన కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఎపీఎస్‌బీటీఈటీ.ఇన్/ఫార్మసీ అనే వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న తరువాత రిసిప్ట్ కాపీని డౌన్‌లోడ్ చేసుకుని 7036725872, 9908857585, 9966761446 నంబర్లకు వాట్సాప్‌లో పంపించాలని కోరారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు కౌన్సెలింగ్ చేపట్టే తేదీని ఫోన్ ద్వారా సమాచారం ఇస్తామని వెల్లడించారు.

## రిటైర్డ్ పోలీసులకు ఎస్పీ సన్మానం



ఉద్యోగ విరమణ పొందిన వారితో ఎస్పీ మణికంఠ

**చిత్తూరు అర్బన్:** చిత్తూరు పోలీసుశాఖలో పనిచేసి, పదవి విరమణ పొందిన ముగ్గురు పోలీసులకు ఎస్పీ మణికంఠ చందోలు సన్మానించారు. శుక్రవారం చిత్తూరు పోలీసు అతిథి గృహంలో జరిగిన కార్యక్రమంలో మాధవ నాయుడు (ఎస్‌ఐ, ఎస్‌బీ), మూర్తి (ఏఆర్ ఎస్‌ఐ), పట్టాభి (హోంగార్డు)కు ఉద్యోగ విరమణ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ పాల్గొని విధి నిర్వహణలో వారి నిబద్ధతను అభినందించారు. ఏఎస్పీలు ఆరీ పుల్లా, నాగేశ్వరరావు, పోలీసు యూనియన్ నాయకులు ఉదయ్‌కుమార్, పరంధామనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## 12 నుంచి డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

**తిరుపతి సిటీ :** ఎస్వీయూ పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఈ నెల 12వ తేదీ నుంచి డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు నిర్వహించనున్నట్టు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ దామ్లానాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానంగా డిగ్రీ మొదటి సంవత్సరం రెండో సెమిస్టర్, సెకండ్ ఇయర్ నాలుగో సెమిస్టర్ పరీక్షలను 12వ తేదీ నుంచి జులై 2వ తేదీ వరకు జరుగుతాయని పేర్కొన్నారు. అన్ని డిగ్రీ కళాశాలల్లో ఒక్కో సెమిస్టర్‌కు సుమారు 22 వేల మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు వెల్లడించారు. పరీక్షల షెడ్యూల్‌ను ఇప్పటికే అన్ని కళాశాలల ప్రిన్సిపాళ్లకు పంపించామని తెలిపారు. గతంలో నిర్దేశించిన పరీక్షా కేంద్రాల్లోనే పరీక్షలు జరుగుతాయని, ఇందులో మార్పులేదని పేర్కొన్నారు.

## నేటి నుంచి జూనియర్ కళాశాలలు

– అడ్మిషన్ల ప్రక్రియకు అధికారులు ఏర్పాట్లు

**చిత్తూరు కలెక్టరేట్ :** వేసవి సెలవులు అనంతరం జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ఇతర యాజమాన్యాల ఇంటర్మీడియెట్ కళాశాలలు శనివారం పునఃప్రారంభం కానున్నాయి. ఆయా కళాశాల ప్రిన్సిపళ్లు అడ్మిషన్ల ప్రక్రియకు తగిన ఏర్పాట్లు సిద్ధం చేశారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉన్న 31 ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాలకు సంబంధించిన 106 జూనియర్ ఇంటర్మీడియెట్ కళాశాలలు ఉన్నాయి. యథావిధిగా ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు కళాశాలలను నిర్వహించనున్నారు. పదవ తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు టీసీ, స్టడీ సర్టిఫికెట్, తాత్కాలిక మార్కుల జాబితా ఆధారంగా అడ్మిషన్లు పొందవచ్చు.

## ఆభరణాల చోరీలో మనవడే దొంగ



నిందితుడి అరెస్టును చూపుతున్న పోలీసులు

–3.84 లక్షల సొత్తు స్వాధీనం

**కుప్పం:** మండల పరిధిలోని ఊరునాయనపల్లెలో బంగారు నగల చోరీ కేసులో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ శ్రీనాథ్ తెలిపారు. శుక్రవారం వివరాలను ఆయన వెల్లడించారు. గ్రామానికి చెందిన శివమ్మ ఒంటరిగా ఉంటూ జీవనం సాగిస్తుంది. జీవనం కోసం బెంగళూరుకు వెళ్లి కూలీ పనులు చేసుకుని వారానికి, నెలకు ఒక్కసారి స్వగామానికి వస్తోంది. రెండు రోజుల కిందట బెంగళూరు నుంచి స్వగ్రామానికి వచ్చిన సమయంలో ఇంటి తలుపు తాళాలు పగలు గొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉంది. సామగ్రి చిందర వందరగా ఉంది. బీరువాలోని రూ. 3.84 లక్షలు విలు చేసే బంగారు అభరణాలు చోరీ అయినట్లు గుర్తించి, పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి, అనుమానితులను విచారించారు. శివమ్మకు వరుసకు మనవడు అయిన కదిరివేల్‌ను పోలీసులు విచారించారు. తానే చోరీ చేసినట్లు అతను అంగీకరించాడు. అతన్ని అరెస్టు చేసి, చోరీ సొత్తును రికవరీ చేశారు. రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో సీఐ రమణ, ఎస్‌ఐ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

## మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

**కుప్పంరూరల్:** కుప్పం మండలం ఉర్లవోబనపల్లెలో మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల కథనం మేరకు..గుడుపల్లె మండల, అడవిబదనవాడ గ్రామానికి చెందిన సంపత్ (27) భార్య 20 రోజుల కిందట అనుమానాస్పదస్థితిలో మృతి చెందింది. దీంతో మనస్థాపానికి గురైన సంపత్ ఉర్లవోబనపల్లెలోని అక్క ఇంటి వెళ్లాడు. అక్కడ 20 రోజులుగా ఉన్న సంపత్ శుక్రవారం మధ్యాహ్నం గ్రామం సమీపంలోని గుట్ట వద్ద చెట్టుకు ఉరేసుకుని వేలాడుతుండగా స్థానికులు గుర్తించారు. భార్య మృతితో మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు భావిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన ప్రాంతానికి చేరుకున్నారు. మృతదేహాన్ని కుప్పం వందపడకల ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

# పొలాలపై కాలుష్యం కాటు

చిత్తూరు మండల ప్రజలకు ఫ్యాక్టరీ వ్యర్థాలు ప్రాణాంతకంగా మారాయి. యాజమాన్యాలు నిబంధనలకు తూట్లు పొడుస్తూ విచ్చలవిడిగా వ్యర్థాలను బహిరంగా ప్రదేశాల్లో డంప్ చేస్తున్నాయి. రైతుల పొలాలు, ప్రభుత్వ స్థలాలకు తరలిస్తూ ప్రాణాలతో చెలగాట ఆడుతున్నాయి. వ్యర్థాల్లో టన్నుల కొద్దీ ప్లాస్టిక్ కవర్లు దర్శనమిస్తున్నాయి. డంప్ చేసిన ప్రాంతం దుర్గంధంగా మారడంతో ఆ ప్రాంత వాసులు నివాసం ఉండలేక పోతున్నారు. దిగువమాసాపల్లి, ఎగువమాసాపల్లి, పచ్చన్నపల్లి, అనంతాపురం తదితర ప్రాంతాల్లో వ్యర్థాలు కుప్పలు తెప్పలుగా దర్శనమిస్తున్నాయి. అధికారులకు ఫిర్యాదులందుతున్నా అతీగతీ ఉండడం లేదు.

- నిబంధనలు పాటించని ఫ్యాక్టరీ నిర్వాహకులు
- విచ్చల విడిగా వ్యర్థాల డంప్
- రైతు పొలాలు, ప్రభుత్వ భూములకు తరలిస్తున్న వైనం
- వ్యర్థాలతో పాటు టన్నుల కొద్ది ప్లాస్టిక్, రసాయనాలు
- చిత్తూరు మండలంలో దుర్గంధం భరించలేక పోతున్న గ్రామీణులు



ఓ పొలంలో డంప్ చేసిన ఫ్యాక్టరీ వ్యర్థాలు

**చిత్తూరు రూరల్ (కాణిపాకం):** చిత్తూరు మండలం తిరుత్తణి రోడ్డులో తమిళనాడు సరిహద్దు వరకు పలు ఫ్యాక్టరీలు నడుస్తున్నాయి. కొన్ని ఫ్యాక్టరీలు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయి. కార్మిక చట్టాలు, పొల్యూషన్ బోర్డు నియమాలు, పరిశ్రమల శాఖ విధి విధానాలను పట్టించుకోవడం లేదు. ఫ్యాక్టరీ నుంచి వచ్చే కొన్ని హానికరమైన రసాయనాలు, దుర్గంధం వెదజల్లే గ్యాస్‌ను పైపుల ద్వారా బయటికి వదిలేస్తున్నారు. ఫ్యాక్టరీ నుంచి వచ్చే వ్యర్థాలు, కుళ్లిన పదార్థాలు, పాస్టిక్ కవర్లు, పనికిరాని రసాయనాలను యథేచ్ఛగా ప్రభుత్వ స్థలాలు, వ్యవసాయ భూముల్లో ట్రాక్టర్లు, మినీ టిప్పర్ల ద్వారా డంప్ చేస్తున్నారు. దిగువమాసాపల్లి, ఎగువమాసాపల్లి, పచ్చన్నపల్లి, అనంతాపురం తదితర ప్రాంతాల్లో వ్యర్థాలతో దుర్గంధంగా తయారై ఆయా గ్రామస్తులు అక్కడ నివాసం ఉండలేక పోతున్నారు. వ్యర్థాలను కుక్కలు లాక్కెళ్లి బహిరంగ ప్రదేశాల్లో వదిలి పెడుతున్నాయి. దీంతో దుర్గంధం, దోమలు, ఈగల బెడద ఎక్కువవుతోంది. కొన్ని గ్రామాల నుంచి ఫిర్యాదులు రావడంతో అధికారులు స్పందించి వ్యర్థాలను తొలగించారు. మరికొన్ని చోట్ల మాత్రం వ్యర్థాలు అలానే ఉన్నాయి. సొంత ఇళ్లను వదిలి వెళ్లలేక కాలుష్యంలో గ్రామీణులు జీవిస్తున్నారు.

### ముసురుకుంటున్న రోగాలు

ఫ్యాక్టరీ యాజమాన్యాలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తుండడం ప్రజలకు శాపంగా మారింది. నిబంధనలకు అనుగుణంగా ఫ్యాక్టరీ నడపకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. వ్యర్థాలు బయట పడేయడం, ఫ్యాక్టరీ ద్వారా వచ్చే కాలుష్యం కారణంగా గ్రామాల్లో వ్యాధులు ముసురుకుంటున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దద్దుర్లు వెంటాడుతున్నాయని, జ్వరాలు విజృంభిస్తున్నాయని, కడుపు ఉబ్బరం వంటి అనారోగ్య సమస్యలు ఉద్ధృతమవుతున్నట్లు ప్రజలు వాపోతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

### చర్యలు తీసుకుంటాం

గతంలో పలు ఫ్యాక్టరీ నిర్వాహకులను కలిసి నిబంధనల ప్రకారం ఫ్యాక్టరీలను నడిపించాలని హెచ్చరించాం. మందలించాం కూడా. అయినా కొందరి తీరు మారినట్టు కనిపించడం లేదు. ఫ్యాక్టరీ పరిసర ప్రాంతాలను పరిశీలిస్తాం. సమస్యలుంటే వెంటనే స్పందిస్తాం. కచ్చితంగా నోటీసులు ఇస్తాం. మారకపోతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి..తదుపరి చర్యలు తీసుకుంటాం.

–సుధాకర్‌రెడ్డి, ఎంపీడీఓ, చిత్తూరు